క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు: సాగర్ ఎడమ కాలువ పరిధిలోని పుల్లయ్యబంజర్ మేజర్–2 కు నిధులు మంజూరు చేసి కాలువ నిర్మాణానికి తోడ్పడాలని సోమవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అసెంబ్లీ సమావేశంలో ఇరిగేషన్‌శాఖ గురించి మాట్లాడుతూ.. కల్లూరు మండలంలో ఎన్ఎస్‌పీ పరిధిలో పుల్లయ్యబంజర్ మేజర్–2 కింద కాలువ మంజూరు అయ్యింది.. కానీ, కాలువ నిర్మించకుండా తూము మాత్రమే నిర్మించడంతో రెండు విధాలుగా రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఒకటి పక్కనున్న పొలాలు ముంపుకు గురువుతుండగా.. మరొకటి 1000 ఎకరాలకు సాగునీరు అందకుండా పోతుందన్నారు. కావున నిధులు మంజూరు చేసి కాలువ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

చొప్పకట్లపాలెంలో బీటీ రోడ్డులో మార్పు

బోనకల్: డబ్బాకుపల్లి నుంచి చిరునోముల గ్రామం వరకు లింక్ రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క నిధులు మంజూరు చేశారు. దీంతో సదరు కాంట్రాక్టర్ రోడ్డు పనులను చేసుకుంటూ చొప్పకట్లపాలెం గ్రామం వరకు వచ్చారు. సర్వే నంబర్ 220లో 12ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. రోడ్డు ఆభూమి మధ్యనుంచి వెళ్తుండడంతో ప్రభుత్వ నిర్మాణాలకు ఉపయోగం లేకుండా పోతుంది. దీంతో తహసీల్దార్ పున్నం చందర్ రోడ్డు పనులను పరిశీలించి రోడ్డును ఒక చివరి నుంచి వచ్చే విధంగా మలుపు తిప్పాలని సదరు ఆర్అండ్‌బీ, ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ల్యాండ్‌మార్క్ ఇచ్చిన తరువాత పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్బారావు, ఆర్ఐ నవీన్, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మెన్ కోచింగ్‌సెంటర్ ప్రారంభం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని టెక్నో కళాశాలలో విజినరీ జూనియర్ లైన్‌మెన్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను సీఐ టి.కిరణ్ సోమవారం ప్రారంభించారు. ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్య సాధనకు శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, విజయరాజు, రామకృష్ణ, మిథిన్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి అవార్డులు

తల్లాడ: తల్లాడ పీహెచ్‌సీ వైద్యాధికారి, క్షయ వ్యాధి నోడల్ అధికారి, మిట్టపల్లి ఆశ కార్యకర్త విశిష్ట సేవలందించినందుకు అవార్డులు అందించారు. ఖమ్మం క్షయ నివారణ కేంద్రం వద్ద జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతి భాయి, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ సుబ్బారావు చేతుల మీదుగా సోమవారం వైద్య సిబ్బంది ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కల్లూరు డివిజన్ నుంచి ఉత్తమ వైద్యాధికారిగా ఐ.రత్న మనోహర్, ఉత్తమ నోడల్ అధికారిగా కె.పెద్ద పుల్లయ్య, ఉత్తమ ఆశ కార్యకర్తగా జె.శాంతమ్మకు అవార్డులు అందించారు. ఈ సందర్భంగా వారికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాం, సీహెచ్‌ఓ భాస్కర్ అభినందనలు తెలిపారు.

పరామర్శ..

ముదిగొండ: మండలంలోని యడవల్లికి చెందిన ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు చెరుకుపల్లి బిక్షం కుమార్తె శిరీష ఇటీవల మృతిచెందింది. బిక్షంను పరామర్శించిన అనంతరం శిరీష చిత్రపటానికి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాజీ ఎంపీపీ చల్లారి కుటుంబానికి..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు సతీమణి సక్కుబాయి ఇటీవల మృతి చెందగా.. ఆ కుటుంబాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దయానంద్ సోమవారం పరామర్శించి.. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మన్లు ఆనంద్‌బాబు, నీరజచౌదరి, కమల్‌పాషా, చెన్నారావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: జ్యోతిబాపులే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బీసీ గురుకులాల్లో(ఇంగ్లీష్ మీడియంకు) 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అలాగే 31 మార్చి 2025 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోగలరని వైరా బీసీ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు బోనఫైడ్, ఆధార్‌కార్డు, ఫొటోపై సంతకం, ఫోన్‌నంబర్, ఈ మెయిల్ ఐడీ, కుల ధ్రువీకరణ పత్రం ఆదాయం వంటి ఆధారాలతో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

పంటలు పరిశీలించిన ఏఓ

ముదిగొండ: ముదిగొండలో ఈదురు గాలులకు కిందకు వాలిన మొక్కజొన్న పంటను వ్యవసాధికారి వేణుయాదవ్ సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం అంచనాను నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

యువతకు ఉపాధి.. చేయూత

- 'రాజీవ్ యువ వికాసం' పేరిట నూతన పథకం
- రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు రుణ సదుపాయం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం



రాజీవ్ యువ వికాసం వెబ్‌సైట్

కావాల్సిన అర్హతలు

తెలంగాణలో స్థిర నివాసం కలిగిన వారు ఈ పథకానికి అర్హులు. అలాగే, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారై ఉండాలి. నిరుద్యోగ యువతీ, యువకులకు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, బ్యాంకు ఖాతాల వివరాలు అందజేయాలి. రేషన్ కార్డు కలిగి ఉండాలి. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీలో నమోదు చేసుకుని ఉండాలి.

కొణిజర్ల: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు కలిపించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం' పేరిట నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. యువత స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని ఆత్మ విశ్వాసంతో నిలబెట్టుకునేలా ఆర్థిక స్థితిగతులు మెరుగు పరుచుకునేందుకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా సుమారు 4,200 మంది యువతకు రుణ సదుపాయం అందించనున్నారు.

మూడు కేటగిరీలు..

ఈ పథకం ద్వారా మూడు కేటగిరీల్లో ఆర్థిక సాయం అందించనున్నారు. కేటగిరీ–1 కింద రూ.లక్ష ఆర్థిక సాయం అందుతుంది. ఇందులో 20 శాతం లబ్ధిదారులు చెల్లిస్తే 80 శాతం ప్రభుత్వం భరిస్తుంది. కేటగిరీ–2లో రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తారు. ఇందులో 70శాతం సబ్సిడీ పోగా, లబ్ధిదారుడు 30శాతం సమకూర్చుకోవాలి. కేటగిరీ–3 కింద రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తారు. దీనిలో 60శాతం ప్రభుత్వ సబ్సిడీ ఉండనుండగా 40శాతం లబ్ధిదారుడి వాటాగా చెల్లించాలి. ఈ వాటాధనాన్ని లబ్ధిదారులు స్వయంగా లేదా బ్యాంకుల నుంచి గానీ సమకూర్చుకోవచ్చు.

ఏప్రిల్ 5వరకు దరఖాస్తులు..

తెలంగాణ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 17న మొదలైన దరఖాస్తుల స్వీకరణ ఏప్రిల్ 5వరకు కొనసాగుతుంది. అనంతరం దరఖాస్తులను ఏప్రిల్ 6నుంచి మే 31 వరకు పరిశీలించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తారు. దరఖాస్తులతో పాటు లబ్ధిదారులు తాము నిర్వహించదలుచుకున్న యూనిట్‌కు సంబంధించిన ప్రాజెక్ట్ నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులు స్వీకరించిన తర్వాత కలెక్టర్ పర్యవేక్షణలో మండల స్థాయిలో అధికారుల కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది.

యూనిట్లు ఇలా..

వ్యవసాయ అంశాలు : ఎద్దుల బండ్లు, ఆయిల్ ఇంజిన్, పంప్ సెట్, ఎయిర్ కంప్రెషర్, పత్తి సేకరణ యంత్రం, వేరుశనగ మిషన్, వర్మీ కంపోస్ట్, ఆయిల్ ఫామ్ పంట యూనిట్లుగా ఉన్నాయి.
పశుపోషణ : గేదెలు, ఆవులు, డైరీ ఫారం, కోడిగుడ్ల వ్యాపారం, చేపల వ్యాపారం, మేకల పెంపకం, పాల వ్యాపారం, పౌల్ట్రీ ఫారం, గొర్రెల పెంపకం
సొంత వ్యాపారం : ఎయిర్ కూలర్ల వ్యాపారం, స్టీల్ సామాన్ల వ్యాపారం, ఆటోమొబైల్ షాపు, బేకరీ షాపు, గాజుల దుకాణం, హెయిర్ కటింగ్ షాపు, బుట్టల తయారీ షాపు, బ్యూటీ పార్లర్ షాపు, జనరల్ స్టోర్, ఇటుకలు తయారీ వ్యాపారం, డిష్ టీవీల ఏర్పాటు, వడ్రంగి షాపు, సీసీ కెమెరాల రిపేర్ షాప్, ఎలక్ట్రిక్ షాపు, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ కేంద్రం, మగ్గం టైలరింగ్, చెప్పులు అమ్మే దుకాణం, పండ్ల వ్యాపార కేంద్రం, పండ్ల రసాలు, బట్టలు, కిరాణం జనరల్‌స్టోర్, జనరేటర్, గిఫ్ట్ ఆర్టికల్స్, బంగారు నగల దుకాణం, పిండి గిర్ని కేంద్రం, హోటల్ ఏర్పాటు, ఐస్ క్రీమ్ పార్లర్, ఐరన్, లేడీస్ కార్నర్, లాండ్రీ షాపు డ్రై క్లీనింగ్, పేపర్ ప్లేట్ల తయారీ, లైట్స్ డెకరేషన్ సౌండ్ సిస్టం, అగరబత్తుల తయారీ, మినీ సూపర్ బజార్, మెడికల్ అండ్ జనరల్ స్టోర్ లతో పాటు మరో 40కి పైగా యూనిట్లను స్వయం ఉపాధి కింద ఏర్పాటు చేసుకోవచ్చు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..



నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వం సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా అవగాహన కలిపిస్తున్నాం. యువత దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావాలి.

– ఏ.రోజారాణి, ఎంపీడీఓ, కొణిజర్ల

ప్రతీ నిరుద్యోగికి రాజీవ్ వికాసం అమలు చేయాలి

కొణిజర్ల: రాజీవ్ యువ వికాసం పేరుతో ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించిన పథకం ప్రతీ నిరుద్యోగికి వర్తింప చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సోమవారం కొణిజర్లలో నిర్వహించిన ఆ పార్టీ మండల ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే లక్షలాది మంది యువతీ యువకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని వారు ఇప్పుడు రాజీవ్ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో చూపడం లేదన్నారు. కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న యువతకు ఆర్థిక సాయం ఇవ్వకుండా ఇప్పుడు హడావిడిగా రాజీవ్ యువ వికాసం అని పెట్టడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు కృష్ణ, వెంకటేశ్వరరావు, కుటుంబరావు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలి


ధర్నా చేస్తున్న దివ్యాంగులు, సీపీఎం నాయకులు

పెనుబల్లి: దివ్యాంగులకు లోన్లు అందించి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట దివ్యాంగులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 246 మంది దివ్యాంగులు దరఖాస్తు కోసం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి వేచియుండగా.. 12గంటల సమయంలో ఎంపీడీఓ అన్నపూర్ణ వచ్చి దివ్యాంగుల్లో ఒకరికి మాత్రమే రూ.50వేలు లోన్ ఇవ్వనున్నట్లు తెలిపింది. దీంతో మిగిలిన వారంతా నిరుత్సాహపడ్డారు. దివ్యాంగులందరికీ బ్యాంకుల ద్వారా రూ.లక్ష లోన్‌తో పాటుగా.. పింఛన్ రూ.6వేలు ఇవ్వాలని లేకుండా పోరాటాలకు సిద్ధం కావాలని విఠల్‌రావు నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిరుపతిరావు, చిరంజీవి పాల్గొన్నారు.

దివ్యాంగుల రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో సోమవారం మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల రుణాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరిగింది. మూడు యూనిట్ల రుణాల మంజూరు కోసం 199 మంది దరఖాస్తులు చేశారు. ఒక్కొక్క యూనిట్ రూ. 1.50లక్షల మేరకు 3 యూనిట్లకు ముగ్గురు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ కృష్ణశ్రీ, పంచాయతీ కార్యదర్శులు ఏలేశ్వరరావు, హరికృష్ణ, శ్రీలక్ష్మి, తదితరులున్నారు.

తహసీల్దార్‌కు వినతి..

బోనకల్: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తహసీల్దార్ పున్నం చందర్‌కు వినతిపత్రం అందించారు. గత ఏడాది నవంబర్ సెలవు రోజుల్లో కూడా ఉపాధ్యాయులు సర్వే చేశారని అయినప్పటికీ వారికి రెమ్యూనరేషన్ ఇవ్వలేదని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు చిన్న రంగారావు, ఉపాధ్యక్షులు గోపాల్ రావు, నాయకులు తదితరులు ఉన్నారు.

రూ.600 చెల్లించాలి

చింతకాని: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 200రోజులు పని కల్పించడంతో పాటు.. రూ.600 వేతనం చెల్లించాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండెల వెంకయ్య డిమాండ్ చేశారు.

... సోమవారం మండలం పరిషత్ కార్యాలయం

సోమవారం మండలం పరిషత్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మికులు, మహిళలతో ధర్నా నిర్వహించి మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావుకు అందించారు. కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి, ఏఐపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి హనుమంతురావు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి అన్నారు. మండల కేంద్రంలో సీతారామ లింక్‌కెనాల్‌ను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రాజెక్టు పనులు పూర్తికాకముందే నీటి విడుదల అని హడావుడి చేసిన ప్రభుత్వం రెండు రోజుల వ్యవధిలోనే నీటిని ఆపేసి వ్యవసాయానికి నష్టం వాటిల్లే విధంగా చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజు, షేక్‌బాజీ, చాంద్‌పాషా, ధర్మ నాయక్ పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

సత్తుపల్లిరూరల్: బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ) డివిజన్ కార్యదర్శి ఉమర్ అన్నారు. సత్తుపల్లిలో సోమవారం ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యాన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, లక్ష్మయ్య, చలపతిరావు, రాఘవులు, రమేష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రక్షణ కల్పించాలి

కారేపల్లి: శ్మశాన వాటికకు రక్షణ కల్పించాలని మాలమహానాడు ఆధ్వర్యంలో కారేపల్లి భరత్‌నగర్ కాలనీవాసులు సోమవారం తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, గ్రామ కార్యదర్శి నిరంజన్‌లకు వినతిపత్రాలు అందించారు. అనంతరం కారేపల్లి సంత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాలమహానాడు నాయకుడు, కాలనీ పెద్దలు మాట్లాడారు. కారేపల్లి సుబ్బయ్యకుంట చెరువు సమీపంలో దళితుల శ్మశాన వాటికకు సమీపంలో ఉన్న శ్రీరామ డైరీఫాం (పాడిగేదెల పెంపకం) నుంచి పేడ, ఇతర వ్యర్థాల కారణంగా సమాదులు దెబ్బతినడంతోపాటు.. చెరువు కూడా వ్యర్థమవుతుందన్నారు. కావున అధికారులు శ్మశాన వాటిక, సుబ్బయ్యకుంట చెరువులకు సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కాలనీవాసులు కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు సోమందుల రాములు, గ్రామశాఖ అధ్యక్షులు మైప పీరయ్య, భారత్‌నగర్ కాలనీ వాసులు దేవప్రకాశ్, నరసింహారావు, సోమందుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ


రంజాన్ సరుకులు అందిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: జమాతే ఇస్లామిహింద్ ఆధ్వర్యాన సత్తుపల్లిలోని పేద ముస్లిం కుటుంబాలకు సోమవారం రంజాన్‌మాసం సందర్భంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేఐహెచ్ అధ్యక్షుడు మున్వర్‌ఖాన్ మాట్లాడుతూ.. అందరు సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ఏటా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారావు, ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌బాబు, జామెమసీద్ సదర్ నాయబ్ రసూల్, సెక్రటరీ కమల్‌పాషా, అమీర్ జాని, సమి, జాని, భాషా, షరీఫ్ పాల్గొన్నారు.

టీపీబీఓగా వెంకటకిరణ్


వెంకటకిరణ్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీస్(టీపీబీఓ)గా సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామానికి చెందిన మద్దెల వెంకటకిరణ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన టీపీబీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఈ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహాను కలిసి విధుల్లో చేరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీద్వారాపురి కాలనీలో గల శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి 16 రోజులు అయిన సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, కేశవరెడ్డి, శ్రీధర్, చంద్రారెడ్డి, నాగు, శ్రీనివాస్, సురేష్‌శర్మ, రమాదేవి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తల్లాడ/ఎర్రుపాలెం: తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని టీయూసీఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. తల్లాడలో సోమవారం జరిగిన టీయూసీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదే విధంగా ఎర్రుపాలెంలో ఎంపీడీఓ బి.సురేందర్‌కు జీపీ కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ సదర్భంగా కార్మికులు నాగేశ్వరరావు, జమలయ్య, గోపాల్, మధు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 60వేల మంది కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన


ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మధిర/ఎర్రుపాలెం/ముదిగొండ: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో చిరు వ్యాపారులకు, ఎర్రుపాలెంలోని బనిగండ్లపాడు, ముదిగొండ పీహెచ్‌సీల్లో రోగులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం మధిర ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు, పారామెడికల్ సిబ్బంది, పీపీ యూనిట్ సిబ్బంది ఆధ్వర్యంలో.. అదేవిధంగా దెందుకూరు, మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముదిగొండలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి అరుణాదేవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అనీల్ కుమార్, పృధ్వీరాజ్, మణి హర్షిత్, రామ్మోహన్, మండల వైద్యాధికారి ప్రశాంత్ అవగాహన కల్పించారు. క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వ్యాధి సోకిన వారికి ఉచితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, డాక్టర్ రంజిత్, అశ్విని, పంచాయతీ కార్యదర్శి అశోక్, సీహెచ్‌ఓ మధుసూదన్‌రావు, పీహెచ్ఎన్ రాణి, హెచ్‌ఎస్ పద్మావతి, లత, ఏఎన్ఎంలు వసంత, నీలావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి


చింతకాని: తహసీల్దార్ అనంతరాజుకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చింతకాని: మార్క్‌ఫెడ్ ద్వారా మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం మండల తహసీల్‌లో బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు వినతిపత్రం అందించారు. కొనుగోలు కేంద్రాలు లేక మక్కలను రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు హనుమంతురావు, రమేష్, నర్సయ్య, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

- **కొణిజర్ల:** మండలంలోని పండించిన మొక్కజొన్న పంటను సీపీఐ వైరా నియోజకవర్గ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా మొక్కజొన్నకు రూ.3వేలు మద్దతు ధర చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, సైదులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్, ఎస్సై

మధిర: వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, మధిర టౌన్ అడిషనల్ ఎస్సై చంద్రశేఖర్‌రావు తెలిపారు. సోమవారం మధిరలోని ఆర్‌వీ కాంప్లెక్స్ ఎదురుగా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సంఘం బాధ్యులు జంగా నరసింహారెడ్డి, టీ.వీ.రెడ్డి, జంగా ప్రవీణ్‌రెడ్డి, లక్కిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జంగా శ్రీనివాస్‌రెడ్డి, జే.వీ.రెడ్డి, తూమాటి నవీన్‌రెడ్డి, ఎల్.వీ.రెడ్డి, ఉప్పెల సాంబిరెడ్డి, కటికల శివారెడ్డి, జొన్నల శివారెడ్డి, ఎస్.ఎస్.ఆర్, తల్లపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, బొగత ఆనంద్‌రెడ్డి, బిలూరి కృష్ణారెడ్డి, గుజ్జుల మస్తాన్‌రెడ్డి, గుండా వీరారెడ్డి, బొగ్గుల భరత్‌రెడ్డి, ముక్కెర రాజశేఖర్‌రెడ్డి, బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, శీలం జ్యోతిరెడ్డి, కృష్ణవేణి, తల్లపురెడ్డి సరస్వతి, భార్గవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతలను నిలదీయాలి

పెనుబల్లి: శాసన సభ, పార్లమెంట్‌లో బీసీల రిజర్వేషన్ బిల్లు పెట్టేలా బీజేపీ నేతలను బీసీలందరూ కలిసికట్టుగా నిలదీయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. పెనుబల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బీసీ సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే రాగమయి, చిత్రపటాలకు పూలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, సీతారామారావు, శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కల్లూరు ఏఎంసీ చైర్మన్ నీరజా, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ ఆనందబాబు, కోటేశ్వరరావు, కృష్ణవేణి, రామారావు, కరీముల్లా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

చింతకాని: రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజ్, మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని లచ్చగూడెంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రైతు రుణమాఫీ చేసేవరకు పోరాడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని నాగిలిగొండ, పాతర్లపాడు గ్రామాల్లో లబ్ధిదారులకు సోమవారం కాంగ్రెస్ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భట్టి సిఫార్సుతో మంజూరైన రూ.2లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, రాజశేఖర్, రామారావు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నిషేధించాలి

ఏన్కూరు: బాల్య వివాహాలు నిషేధించాలని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి కోరారు. సోమవారం స్థానిక తహసీల్‌లో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు కోసం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కిశోర బాలికలు ఉన్న ప్రతి ఇంటిని సందర్శిస్తు తల్లిదండ్రుల వద్ద నుంచి 18 సంవత్సరాలు దాటిన తరువాత వివాహం చేస్తామని హామీ తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి సానిప్రెమలీన, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ రమేష్, ఏఓ నర్సింహారావు, ఎస్సై రఫీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనుబల్లి: మినీ ట్రక్కు ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడికి గాయాలైన ఘటన మండలంలోని బయ్యన్నగూడెం వద్ద సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని తుమ్మలపల్లికి చెందిన రాయల వెంకటేశ్వర్లు బైక్‌పై వీఎం బంజర్ వైపు వస్తుండగా వెనుక నుండి వచ్చిన మినీ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం పెనుబల్లి తరలించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

ఎర్రుపాలెం: అనారోగ్యంతో మృతి చెందిన తండ్రికి ఓ కూతురు తలకొరివి పెట్టి కన్న రుణాన్ని తీర్చుకుంది. పలువురుని కంటతడి పెట్టించిన సంఘటన సోమవారం మండలంలోని బనిగండ్లపాడులో చోటు చేసుకుంది. బనిగండ్లపాడుకు చెందిన శీలం సంజీవరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ.. ఆదివారం కన్నుమూశారు. అతనికి కొడుకులు లేరు. ఒక్క కుమార్తె హారిక ఉండడంతో ఆమె అంతిమయాత్ర నిర్వహించి, దహన సంస్కారాలను పూర్తి చేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందించటం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి వీరపనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ప్రొద్దుటూరు ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న ఎంఈఓ శ్రీనివాసరావును పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సైదులు, ఉపాధ్యాయులు కృష్ణారావు, సరళ, శ్రీనివాసరావు, ప్రభాకర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

శిలువమార్గ ప్రదర్శన

తల్లాడ: తపస్సుకాలంలో మండలంలోని మల్లవరం గ్రామంలో సోమవారం శిలువమార్గ ప్రదర్శన నిర్వహించారు. మల్లవరం బాల మరియమ్మ చర్చి ఆధ్వర్యంలో 14 స్థలాల్లో శిలువమార్గం నిర్వహించి, అనంతరం ఆరాధన, దివ్యబలిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో లూర్దుమాతా విచారణ గురువులు ఫాదర్ అజయ్, ఫాదర్లు శౌరీ, ప్రాన్సిస్, మరియన్న, సంఘ ఉపదేశికులు, దీక్షాపరులు, సంఘస్తులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి


పెనుబల్లి: భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తల్లాడ/పెనుబల్లి: తల్లాడ మండలంలోని గోపాలపేట, కుర్నవల్లి గ్రామాల్లో సోమవారం భగత్ సింగ్ 94 వ వర్ధంతి సభలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. అదే విధంగా పెనుబల్లి మండలంలోని వీయంబంజర్ రింగ్ సెంటర్లో భగత్ సింగ్ వర్ధంతి సభను సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డిర, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు భగత్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటనరసయ్య, కృష్ణయ్య, ఫకీరమ్మ, నాగేశ్వర్‌రావు, కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తిరుపతిరావు, నాయకులు చిరంజీవి, అరుణ్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.